బెయిలీ బ్రిడ్జికి మోక్షమెప్పుడు ?

- తుప్పు పట్టి దెబ్బతింటున్న ఇనుప రేకులు
- ప్రమాదకరంగా మారుతున్న రాకపోకలు
- ఆందోళనలో ప్రజానీకం

కంకిపాడు: బెయిలీ బ్రిడ్జి.. మరమ్మతులు బ్రిడ్జిగా మారిపోయింది. బ్రిడ్జిపై అమర్చిన ఇనుప రేకులు దెబ్బతిన్న ప్రతి సారీ మరమ్మతులు చేస్తున్నారే తప్ప పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచే యోచన చేయటం లేదు. దీంతో సంవత్సరాలు గడుస్తున్నా బ్రిడ్జి పరిస్థితిలో మాత్రం మార్పు రావటం లేదు. దెబ్బతిన్న ఇనుప రేకులు ధ్వంసమై వాహనాలు ఇరుక్కుపోయి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రాకపోకలు ప్రమాదకరంగా మారాయంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని కుందేరు గ్రామం గుండా రైవస్ కాలువ ప్రవహిస్తోంది. వంతెనపై బ్రిటిష్ కాలం నాడు నిర్మించిన వంతెన 2006లో శిథిలమైంది. రాకపోకలకు వీలుగా యుద్ధప్రాతిపదికన బెయిలీ బ్రిడ్జిని(ఇనుప రాడ్ల సాయంతో) నిర్మించారు. ఈ బ్రిడ్జి మీదుగా కుందేరు - కందలంపాడు- మానికొండ గ్రామాలకు రాకపోకలు సాగుతున్నాయి. కుందేరు - మానికొండ రోడ్డు మార్గం మానికొండ వద్ద కంకిపాడు - గుడివాడ ప్రధాన రహదారిని కలుస్తుంది. ఉంగుటూరు, కంకిపాడు మండలాలతో పాటు ఉయ్యూరు మండలంలోని పలు గ్రామాల ప్రజలు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు.

తుప్పు పట్టి.. ధ్వంసమై..

కాల క్రమంలో బ్రిడ్జికి అమర్చిన ఇనుప రేకులు తుప్పు పట్టి ధ్వంసమవుతున్నాయి. తరచూ ఇనుప రేకులు దెబ్బతినడం, జారిపోవటం జరుగుతుంది. ఇలా జరిగిన ప్రతి సారీ ఆర్అండ్బీ అధికారులు ఆఘమేఘాలపై దెబ్బతిన్న రేకులను మార్చటం, మరమ్మతులు చేపట్టడానికి నిధులు కేటాయించటం చేస్తున్నారు. ఇలా దశాబ్దకాలంపైగా జరుగుతూనే ఉంది. మరమ్మతులతో సరిపెడుతున్నారే తప్ప బ్రిడ్జిని పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి రైవస్కాలువపై నిర్మిస్తున్న శాశ్వత వంతెన పూర్తయ్యే వరకూ అందుబాటులోకి తేవాల్సి ఉంది. కానీ ఆ దిశగా చర్యలు చేపట్టకుండా తాత్కాలికంగా మరమ్మతులతోనే సరిపెడుతున్నారు.

ప్రమాదకరంగా రాకపోకలు..

బ్రిడ్జి మరమ్మతులకు గురికావటంతో రాకపోకలకు ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. వ్యవసాయ భూముల్లోకి వెళ్లే ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు సైతం బ్రిడ్జికి అమర్చిన రేకులు కదిలిపోయి బ్రిడ్జిపై ఇరుక్కుపోవటం, ఎడ్లు కాళ్లకు గాయాలు కావటం వంటి ఘటనలు ఇటీవల కాలంలో నిత్యకృత్యంగా మారాయి. పాదచారులు నడవలేని పరిస్థితి నెలకొంటోంది. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా బ్రిడ్జిని సమర్థంగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



రైవస్ కాలువపై కుందేరు వద్ద ఉన్న బెయిలీ బ్రిడ్జి



రేకులు ధ్వంసమై ఇరుక్కుపోయిన ట్రాక్టర్(ఫైల్)

ప్రమాదకరంగా వంతెన..



రైవస్ కాలువపై ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా తయారైంది. ఎప్పుడెలాంటి ప్రమాదం వినాల్సి వస్తుందోనన్న భయం వెంటాడుతోంది. ఇటీవల జరిగిన మండల పరిషత్ సమావేశంలోనూ బ్రిడ్జి మరమ్మతులు గురించి ప్రస్తావించాం. శాశ్వత వంతెన అందుబాటులోకి వచ్చే వరకూ బెయిలీ బ్రిడ్జి మరమ్మతులు ఒకే పర్యాయం సమర్థంగా చేపడితే తరచూ మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉండదు.

– నందిపాటి బిందుమాధవి,
ఎంపీటీసీ సభ్యురాలు, కుందేరు

మరమ్మతులకు నిధుల కేటాయింపు..

బ్రిడ్జి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. యుద్ధప్రాతిపదికన మరమ్మతులకు రూ 10 లక్షలు నిధులు కేటాయించారు. ఈ నిధులతో బ్రిడ్జి మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేస్తాం. నిధులు సద్వినియోగం అయ్యేలా చర్యలు చేపడతాం.

– మల్లికార్జున,
ఏఈ, ఆర్అండ్బీ, కంకిపాడు

క్లుప్తంగా

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



పెనమలూరు: పోరంకిలో సీఎం చంద్రబాబు నాయుడు గురువారం పర్యటన సందర్భంగా అధికారులు బుధవారం ఏర్పాట్లు పరిశీలించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్కుమార్ మీనా, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, జిల్లా ఎస్పీ గంగాధరరావు కల్యాణ మండపంలో ఏర్పాట్లను సమీక్షించారు. ఏడాది పాలనలో సాధించిన విజయాలపై సీఎం గురువారం సాయంత్రం 5 గంటలకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లతో సమావేశమవుతారని అధికారులు తెలిపారు.

నున్న గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సురేష్



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కోట సురేష్ బుధవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఆకునూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న సురేష్ను ప్రభుత్వం నున్న గ్రామానికి బదిలీ చేసింది. గత ఆరు నెలలుగా ఇన్చార్జి కార్యదర్శిగా పని చేసిన అంబాపురం కార్యదర్శి డి.శ్రీనివాసరావు నుంచి సురేష్ బాధ్యతలను స్వీకరించారు. సురేష్ను వైఎస్సార్ సీపీ నాయకులు యర్కారెడ్డి నాగిరెడ్డి, ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, పోలారెడ్డి చంద్రారెడ్డి, దండు సుబ్రహ్మణ్యం రాజు, దాసరి కిరణ్, పి.కోటేశ్వరరావు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

14 నుంచి స్టూడెంట్ బస్పాస్లు మంజూరు

గన్నవరం: విద్యార్థులకు కొత్త బస్పాస్లను ఈ నెల 14వ తేదీ నుంచి గన్నవరం, హనుమాన్జంక్షన్ బస్టాండ్ల్లోని కౌంటర్లలో మంజూరు చేయనున్నట్లు డీఎం పి.శివాజీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ముందుగా బస్పాస్.ఏపీఎస్ఆర్టీసీఆన్లైన్.ఇన్ వెబ్సైట్లో నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం బస్టాండ్లోని ప్రత్యేక కౌంటర్ల వద్దకు వచ్చి బస్పాస్ పొందాలన్నారు. 12 ఏళ్లలోపు బాలురకు, 18 ఏళ్లలోపు పదో తరగతి వరకు చదువుతున్న బాలికలకు ఉచిత బస్పాస్లు ఇస్తామని చెప్పారు. కళాశాల విద్యార్థులకు మాత్రం కన్సెషన్ పాస్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపన



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో పలు డ్రెయినేజీల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. గంగూరు చేపల కుండీల వద్ద రూ.కోటి జనరల్ ఫండ్స్తో మున్సిపాలిటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.భూషణం శంకుస్థాపన చేశారు. అలాగే కానూరు సూపర్విజ్ రోడ్డులో రూ.75 లక్షల జనరల్ ఫండ్స్తో డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అమారుపూడి ధనకోటేశ్వరరావు, అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్ప్రసాద్, వెలగపూడి శంకర్బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అందుబాటులోకి రైతుబజారు

ఆటోనగర్(విజయవాడతూర్పు): పటమట రైతుబజారు గురువారం నుంచి కొనుగోలుదారులకు అందుబాటులోకి రానుంది. గత కొద్ది రోజులుగా ఈ మార్కెట్కు మరమ్మతులు చేస్తున్నారు. మరమ్మతులు పూర్తి కావడంతో గురువారం నుంచి పటమట రైతుబజారు అందుబాటులోకి వస్తుందని రైతుబజారు ఎస్టేట్ అధికారి ఎం.రమేష్బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



హనుమాన్జంక్షన్రూరల్: రహదారులపై అడ్డంగా ఆటోలు నిలిపి ట్రాఫిక్కు అంతరాయం కలిగించే ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హనుమాన్జంక్షన్ ఎస్ఐ వి.సురేష్ హెచ్చరించారు. స్థానిక నూజివీడు రోడ్డు, విజయవాడ రోడ్డు, గుడివాడ రోడ్లలో బుధవారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ఆటోడ్రైవర్ల లైసెన్స్, వాహన పత్రాలను పరిశీలించారు. ఆటో డ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. అతి వేగం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని చెప్పారు. రహదారులపై విచ్చలవిడిగా ఆటోలను నిలిపివేయటంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని, వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతుందన్నారు. రహదారులపై ఆటోలు నిలపకుండా, ఆటో స్టాండ్ కోసం నిర్దీత స్థలాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏఎస్ఐ ఇంకొల్లు సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరులో విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు అన్నారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ గురువారం జేఆర్డీ టు ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. దీని కారణంగా మురళీనగర్, నవతా రోడ్డు, చెక్కా నాగేశ్వరరావు రోడ్డులో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

ఆటపాటలతో కూడిన విద్య అవసరం



ప్రొద్దుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్వైజర్ అన్నామణి, స్థానికులు



కానూరు అంగన్వాడీలో ప్రీ స్కూల్ విద్యార్థులు

కంకిపాడు: ఆట పాటలతో కూడిన విద్య చిన్నారులకు అవసరమని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సూపర్వైజర్ ఎస్.అన్నామణి అన్నారు. అంగన్వాడీ పిలుస్తోంది రా కార్యక్రమం ప్రొద్దుటూరు గ్రామంలో బుధవారం నిర్వహించారు. చిన్నారులు, తల్లిదండ్రులు ప్ల కార్డులు చేతబట్టి గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. అన్నామణి మాట్లాడుతూ.. మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారుల్లో జరిగే శారీరక, మానసిక, మేథో అభివృద్ధి ఎంతో కీలకమన్నారు. ఆట పాటలతో కూడిన విద్య ద్వారా చిన్నారుల్లో జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మోడల్ ప్రైమరీ పాఠశాల హెచ్ఎం ఎన్.వెంకటరమణ, సీఆర్పీ ఉషాలత, అంగన్వాడీ కార్యకర్తలు ఎం.సంయుక్తరాణి, కె.నాగమణి పాల్గొన్నారు. కంకిపాడు పట్టణంలోని ఐదో అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ పిలుస్తోంది రా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రదర్శన చేపట్టారు. కార్యకర్త వై.నళినీకుమారి మాట్లాడుతూ.. పీపీ -1, 2 పాఠ్యపుస్తకాల ద్వారా చిన్నారులకు విద్య అందుతుందని, అంగన్వాడీ కేంద్రాల్లో అందించే సేవలను, సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు.

అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పెనమలూరు: అంగన్వాడీ కేంద్రాలను తల్లులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ జి.విజయలక్ష్మి అన్నారు. కానూరు అంగన్వాడీ – 2 లో బుధవారం అంగన్వాడీ బాట పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చేరే చిన్నారులకు పలు ప్రభుత్వ పథకాలు అమలు జరుగుతాయన్నారు. విద్యా బోధనతో పాటు పోషకాహారం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తల్లులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్టాండ్ ప్రాంగణం దుర్గంధభరితం



డ్రెయినేజీ మురుగు బస్టాండులోకి చేరుతున్న దృశ్యం

కంకిపాడు: డ్రెయినేజీ మురుగు బస్టాండ్లోకి చేరుతుండటంతో బస్టాండ్ ప్రాంగణమంతా దుర్గంధభరితంగా మారుతోంది. బస్టాండ్కు వచ్చే ప్రయాణికులు మురుగులో నడవలేక, వెలువడే దుర్గంధానికి తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారి మార్జిన్లో ప్రధాన డ్రెయినేజీ వ్యవస్థ పారుదల అవుతోంది. బస్టాండ్ ముఖద్వారం వద్ద ఉన్న డ్రెయిన్ శిథిలమైంది. తూములు ధ్వంసం కావటంతో మురుగు పొంగి పొర్లుతోంది. పగిలిన డ్రెయినేజీ తూముల నుంచి నేరుగా బస్టాండ్ ఆవరణలోకి చేరుతుంది.

కొద్ది రోజులుగా మురుగుతో బస్టాండ్లోకి వచ్చే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖద్వారం సగభాగం బారికేడ్లు ఏర్పాటు చేశారు. డ్రెయిన్ తూములకు మరమ్మతులు చేయకపోవడంతో బస్టాండ్ ప్రాంగణంలోకి వచ్చి వెళ్లే బస్సులు రద్దీ కూడా అధికమవుతుంది. పంచాయతీ అధికారులు స్పందించి డ్రెయినేజీ మరమ్మతులు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా సుదర్శన, ధనలక్ష్మి హోమాలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

గన్నవరం: స్థానిక పాత గన్నవరంలో కొలువైన శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో బుధవారం శ్రీసుదర్శన హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ క్రతువును చేపట్టారు. తొలుత శ్రీలక్ష్మీతిరుపతమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ వేదికలో పరాశరం రామకృష్ణ, ఆయన శిష్య బృందంచే శ్రీసుదర్శన నరసింహ లక్ష్మీగణపతి, ధనలక్ష్మి, నవగ్రహ హోమాలను ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, సభ్యులు జాస్తి శ్రీనివాసరావు నేతృత్వంలో హోమ క్రతువును పూర్తిచేశారు. పంటలు సంవృద్ధిగా పండాలని, రైతులు బాగుండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఈ హోమం నిర్వహించినట్లు శ్రీధర్ తెలిపారు. మహా పూర్ణాహుతిని సమర్పించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు, మాజీ సర్పంచి గూడపాటి తులసీమోహన్ విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిపారు. ఆలయ కమిటీకి చెందిన జాస్తి ఫణికుమార్, మోదుగుమూడి వేణు, చిమట శ్రీను, గూడపాటి సీతారాంబాబు, కాసరనేని నాని తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభం



పనుల గురించి చర్చిస్తున్న కార్యదర్శి రామ్మోహనరావు తదితరులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తెలిపారు. గ్రామంలోని పీఎస్ఆర్ కాలనీలో బుధవారం హిందూ శ్మశానవాటికను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ పంచాయతీ నిధులు రూ.20 లక్షలతో శ్మశానవాటికను అభివృద్ధి చేస్తున్నామన్నారు. దహన సంస్కారాలకు ఐరన్ గ్రిల్స్ 4, స్లాబ్, ఫ్లోరింగ్, టైల్స్ పనులు చేపడతామని చెప్పారు. ఇటీవల నిర్వహించిన పాలక వర్గ సమావేశంలో శ్మశానవాటిక అభివృద్ధికి తీర్మానం చేశామన్నారు. అలాగే ముస్లిం శ్మశానవాటిక చుట్టూ రూ.8.50 లక్షలతో ప్రహరీ నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. హిందూ శ్మశానవాటికలో తుది దశలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి గ్రామస్తులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అద్దెపల్లి సాంబశివనాగరాజు, మాజీ ఉప సర్పంచ్ కొల్లా ఆనంద్కుమార్, కొంగన రవి తదితరులు పాల్గొన్నారు.

వణుకూరులో యూపీ వాసిపై దాడి

పెనమలూరు: వణుకూరు గ్రామంలో ఉత్తరప్రదేశ్కు చెందిన వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు ముగ్గురు దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్కు చెందిన మహేంద్రసింగ్ కార్పెంటర్ పనులకు వచ్చి కొద్ది కాలంగా వణుకూరు గ్రామంలో ఉంటున్నాడు. అతను తన బైక్ను సరీ్వసింగ్ కోసం గోసాల సెంటర్కు వెళ్లి మెకానిక్కు బైక్ అప్పగించాడు. అతను నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా వణుకూరు గొంతెమ్మ ఆలయం వద్దకు రాగా అక్కడ ఉన్న గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు అటకాయించి కొత్త వ్యక్తిలా ఉన్నాడని కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి కృషి



దావాజిగూడెం(గన్నవరం): గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. మండలంలోని దావాజిగూడెం, పామర్తినగర్లో నూతనంగా నిర్మించిన సీసీ, బీటీ రోడ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అనంతరం ఖరీఫ్ సాగు ప్రారంభం సందర్భంగా ఏరువాక పండుగలో ఆయన పాల్గొన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం చేయాలని వినతి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గన్నవరం: రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.వెంకటప్పయ్య, వై.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 'డిమాండ్స్ డే' లో భాగంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న జర్నలిస్టుల సమస్యలపై దృష్టి సారించలేదన్నారు. జర్నలిస్టులపై దాడులు నానాటికి పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇళ్ల స్థలాలు, ఆరోగ్య బీమాను రెన్యువల్ చేయాలని, కార్మిక బీమా సదుపాయం కల్పించాలని కోరారు. నాయకులు అచ్యుతరావు, బాలస్వామి, సురేష్, శ్రీనివాసరావు, ప్రకాష్, వెంకటేశ్వరరావు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



గన్నవరం: కార్పొరేట్ స్కూళ్లలో బుక్స్, యూనిఫాం, స్టేషనరీ విక్రయాల పేరుతో జరుగుతున్న దోపిడీని విద్యాశాఖ అడ్డుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పలు ప్రైవేట్ స్కూళ్ల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అక్షరాల పేరుతో విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి అక్రమ పద్ధతిలో విద్యా సంస్థలు లక్షల రూపాయిలు దండుకుంటున్నాయని ఆరోపించారు. నిబంధనల విరుద్ధంగా కార్పొరేట్ స్కూళ్లలో బుక్స్, యూనిఫాం, స్టేషనరీ రూ.15 వేల నుంచి రూ. 35 వేలు వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. ఇంత జరుగుతున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేట్టాన్నారు. ఇప్పటికైనా నిబంధనలు పాటించని స్కూళ్లు, కళాశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సంఘ నాయకులు సాధిక్బాబు, సిద్ధు, ప్రిన్సి, రోహిత్, అవినాష్, హుస్సేన్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు తొలగిస్తామనడం అన్యాయం



కానూరులో నివాసితులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పెనమలూరు: కానూరు గుమ్మడి తోటలో పేదల ఇళ్లు అన్యాయంగా తొలగిస్తే సీపీఎం అడ్డుకుంటుందని ఆ పార్టీ మండల కార్యదర్శి షేక్.కాశిం అన్నారు. సీపీఎం నాయకులు బుధవారం గుమ్మడితోటలో కాలువ కట్టపై ఉన్న నివాసితుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. గత 40 సంవత్సరాలుగా ఉంటున్న పేదల ఇళ్లు తొలగిస్తామని తహసీల్దార్ నోటీసులు ఇవ్వటం దారుణమన్నారు. పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు.

అధికార పార్టీ, అధికారులు పేదల పట్ల అన్యాయంగా వ్యవహరించటం తగదన్నారు. ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించిన తరువాతే పేదలు స్వచ్ఛందంగా ఖాళీ చేస్తారన్నారు. అప్పటి వరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకున్నా ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పాడ త్రిమూర్తి, షేక్ మస్తాన్వలి, మాదు నాగేశ్వరరావు, రత్నకరుణ, స్థానికులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

హనుమాన్జంక్షన్రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానానికి చెందిన యనమదల రామస్వామి ధర్మసత్రం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుకాణాలను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బుధవారం ప్రారంభించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ రూ.29 లక్షలతో నిర్మించిన ఈ షాపింగ్ కాంప్లెక్స్ను లాంఛనంగా ప్రారంభించారు. తొలుత అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, పెదపాడు తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఆలయ కార్యనిర్వహణాధికారి పితాని తారకేశ్వరరావు, పుర ప్రముఖులు వేమూరి శ్రీనివాసరావు, చింతా జగ్గారావు, పావులూరి రామారావు పాల్గొన్నారు.

File No. DCSMO - APSCSCL - KRISHNA No. PDS/Stage-II/2025-27, Dt. 11.06.2025

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, కృష్ణాజిల్లా.

ఇ-ప్రొక్యూర్మెంట్ ప్రకటన

టెండర్ నోటిఫికేషన్ నెం. PDS.3/7/Stage-IITenders/2025-27 తేది : 11.06.2025

2025 - 27 ఆర్థిక సంవత్సరమునకు జిల్లా [illegible] గుడివాడ, పామర్రు, ఉయ్యూరు మరియు గన్నవరం మండలస్థాయి [illegible] www.apeprocurement.gov.in ద్వారా డౌన్లోడ్ చేసుకొనవచ్చును.

1. బిడ్ డౌన్లోడ్ ప్రారంభం తేదీ & సమయం : 19.06.2025, ఉదయం 10.00 గం.నుంచి
2. బిడ్ దాఖలుచేయు ఆఖరితేది & సమయం : 23.06.2025, ఉదయం 10.00 గం.వరకు
3. పూర్తి వివరాలకు సెల్ నెం. 77020 08510 & 99881 79157లకు సంప్రదించగలరు.

Sd/- శ్రీమతి గీతాంజలి శర్మ, ఐ.ఎ.ఎస్
జాయింట్ కలెక్టర్ & ఇ.ఓ.ఇ.డి.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, కృష్ణాజిల్లా.

ప్రకటన

నా క్లయింట్ అయిన మండలం వెంకట నాగేశ్వర్ S/o నాగేశ్వరయ్య [illegible], వయస్సు: 56 సం.లు, నివాసం: [illegible] శ్రీ వనదుర్గా నిలయం, యలమంచిలి వీరయ్య స్ట్రీట్, అమరావతి కాలనీ, రోడ్డు నెం. 3, కానూరు - 520007, కృష్ణాజిల్లా(ఆధార్ నెం.7115 7054 3197) ఆంధ్రప్రదేశ్ వీరినుండి సంబాయిషీ పొందిన, ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ యొక్క స్థిరాస్తి విక్రయ దస్తావేజు నెం. 2774/1998 [illegible] 25.05.2025న [illegible] ఈ స్థిరాస్తి ఒరిజనల్ దస్తావేజు నెంబరు 1) 2774/1998 [illegible]

అడుసుమిల్లి మల్లికార్జునరావు, అడ్వకేట్ & నోటరీ
డోర్ నెం. 29-1-90ఎ, గవర్నర్పేట,
విజయవాడ, సెల్ : 9603091581